క్లుప్తంగా

వందేళ్ల వృద్ధుడికి కంటి శస్త్రచికిత్స


చిన అప్పారావు

అమలాపురం టౌన్: ప్రస్తుత యాంత్రిక జీవనంలో 50 ఏళ్లకే కళ్ల సమస్యలు తలెత్తుతున్నాయి. అలాంటిది వందేళ్ల ఓ వృద్ధుడు తన కళ్లలో ఓ కంటికి శస్త్రచికిత్స చేయించుకుని తిరిగి చూపు పొందాడు. కాట్రేనికోన మండలం గిడ్డివారిపేటకు చెందిన గిడ్డి చిన అప్పారావు (100) అమలాపురం సత్య నేత్రాలయంలో బుధవారం కంటి శస్త్రచికిత్స చేయించుకున్నారు. అనంతరం చిన అప్పారావు కంటిచూపు పూర్తిగా మెరుగుపడిందని ఆ శస్త్ర చికిత్స చేసిన కంటి వైద్య నిపుణుడు కడలి ప్రసాద్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా డీఎంఎస్ ఇన్‌చార్జిగా సురేష్


నిమ్మకాయల సురేష్

అమలాపురం టౌన్: దివ్యాంగ్ మహా సంఘటన్ (డీఎంఎస్) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జిగా అమలాపురానికి చెందిన నిమ్మకాయల సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు డీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు నందూరి రమేష్ నుంచి సురేష్ నియామక పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర దివ్యాంగ్ మహా సంఘటన్‌కు సంబంధించి అన్ని కమిటీలు రద్దయిన క్రమంలో మళ్లీ నూతన కమిటీ ఏర్పాటు చేసే వరకూ డీఎంఎస్‌కు రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న సురేష్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జిగా నియమించినట్లు రమేష్ పేర్కొన్నారు.

అమలాపురం 'సహకార' అధ్యక్షునిగా శ్రీనివాసరావు


తోట శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీకళా వెంకట్రావు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ నూతన త్రిసభ్య కమిటీ పర్సన్ ఇన్‌చార్జి (అధ్యక్షుడు)గా పట్టణానికి చెందిన తోట శ్రీనివాసరావు నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా మట్టపర్తి నాగేంద్ర, నాగాబత్తుల రాజారావులను నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. సహకార సంఘాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగించిన నేపథ్యంలో జిల్లాలోని 15 సంఘాలకు కొత్త కమిటీలు నియమించారు. ఇందులో అమలాపురం సహకార సంఘం ఒకటి. కొత్త త్రిసభ్య కమిటీని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అభినందించారు.

విద్యుత్ కనెక్షన్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

యానాం: నియోజకవర్గంలో కొత్త విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ లంక కృష్ణారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త సర్వీసు, లోడ్ పెంచడం, తగ్గించడం, కేటగిరీ మార్పు తదితర వాటికి 'ఎలక్ట్రిసిటీ.పీవై.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ లేదా 'పిఇడిసర్వీసెస్.పీవై.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఆన్‌లైన్ కాపీని విద్యుత్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

బస్ సర్వీస్ ప్రారంభం

యానాం: యానాం నుంచి పుదుచ్చేరి బస్సు సర్వీసు బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ సర్వీసు కోసం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు ఉద్యోగాలు, విద్యార్థుల నుంచి అనేక వినతిపత్రాలు వ వచ్చాయి. దీంతో ఆయన స్పందించి ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థ శ్రీకృష్ణ ట్రావెల్స్‌తో చర్చించి రోజూ యానాం నుంచి పుదుచ్చేరికి ఓల్వా స్లీపర్ క్లాస్ బస్ నడిపేలా ఒప్పించారు. దీంతో ప్రతి రోజు సాయంత్రం 4.30కు యానాం కొత్త బస్టాండ్‌లో బస్సు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30కు పుదుచ్చేరి చేరుకుంటుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

ఐ.పోలవరం: హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కొమరగిరిలో వీధి శ్రీనుబాబు అధ్యక్షతన సభ జరిగింది. కాకాడ నూకరాజు మాదిగ, నవరపు భైరవమూర్తి, యార్లగడ్డ సత్తిబాబు, లంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ మేనేజర్‌కు సన్మానం

కాట్రేనికోన: మూడేళ్లుగా డీసీసీబీ బ్యాంకు మేనేజర్‌గా పనిచేసి కె.గంగవరం బ్రాంచ్‌కి బదిలీపై వెళ్లిన జీబీ మనోహర్‌ను బుధవారం సొసైటీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని బ్యాంకు ఖాతాదారులు, సిబ్బంది సహాయ సహకారాలు మరువలేనివన్నారు. డీసీసీబీ నూతన మేనేజర్ పీతల శ్రీనివాసరావు, కార్యదర్శులు యర్రంశెట్టి రామచంద్రరావు, అప్పారి సత్య ప్రేమేశ్వరరావు, దంతులూరి రామకృష్ణరాజు, కోటిపల్లి శ్రీరామ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆపద కాలం... ఆపన్నహస్తం

- వరద బాధితులకు దాతల సాయం
- ఉదారత చాటుతున్న వైనం

తాళ్లరేవు: వరద అతలాకుతలం చేసింది.. లంక వాసులను అల్లాడించింది.. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకొచ్చారు. తమకు తోచిన సాయం అందించి ఉదారత చాటుతున్నారు. పిల్లంక శివారు కొత్తలంకలో వరదలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న బాధితులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత చింతలపాటి శ్రీనివాసరాజు అండగా నిలిచారు. వారం రోజులుగా వరద నీటిలో చిక్కుకుని వంటావార్పు లేకుండా ఇబ్బందులు పడుతున్న 600 మంది బాధితులకు ఆయన ఆధ్వర్యంలో చికెన్ బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శ్రీనురాజును పలువురు అభినందించారు. కోఆప్షన్ సభ్యుడు కూరాటి శ్రీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కాగిత రాజు, ఎంపీటీసీ మోర్త భీమాభాయి, కన్వీనర్ కాకర్లపూడి కృష్ణరాజు, సాగి బొజ్జిరాజు, సాగి హరిబాబు, కుమార్‌రాజు, కోరుకొండ చంటి, వాసు, శివరామరాజు, సుజాత, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అన్నంపల్లి శివారు చింతపల్లిలంకలో వరద బాధితులకు 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. వీటిని గ్రామ సర్పంచ్ మట్టపర్తి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. వైస్ ఎంపీపీ పాము నాగవేణి, చిట్టిబాబు, పెసింగ్ నూకరాజు, సాగి సోమరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే వరద ప్రభావిత ప్రాంతాలలో బాధిత కుటుంబాలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ, నాయకులు పరామర్శించారు.


కొత్తలంకలో వరద బాధితులకు బిర్యానీ ప్యాకెట్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిత్యావసరాల పంపిణీ

అల్లవరం: బోడసకుర్రులో వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా అందించిన నిత్యావసరాలను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి పంపిణీ చేశారు. పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను అందించారు. ఎంపీటీసీ బస్వాని పద్మ, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి షణ్ముఖరావు, జల్లి రాధాకృష్ణ, దొమ్మేటి రాధాకృష్ణ, సాపే ధర్మరాజు అధికారులు పాల్గొన్నారు.

దాణామృతం అందజేత

వరద ప్రభావిత ప్రాంతాల్లోని పాడి పశువులకు ఇబ్బంది రాకుండా పశు వైద్యశాఖ డీడీ కర్నీడి మూర్తి ఆధ్వర్యంలో సంపూర్ణ దాణామృతం పంపిణీ చేశారు. బోడసకుర్రు పల్లిపాలెంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గోపాయిలంక, పల్లిపాలెం గ్రామాల్లోని 47 మంది పాడి రైతులకు ఆరు టన్నుల దాణామృతాన్ని అందించారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీటీసీ బస్వాని పద్మ, ఏడీ విజయారెడ్డి, డాక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలో 375 పశువులకు నాలుగు టన్నుల దాణామృతాన్ని పంపిణీ చేశారు. కేశనకుర్రులో మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, వైస్ ఎంపీపీ పి.బాబ్జిరాజు, పశు వైద్యాధికారి డి.శ్రీనివాస్, ఎంపీటీసీ చెల్లి రమాదేవి తదితరులు పంపిణీ చేశారు.


చింతపల్లిలంకలో బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు


బోడసకుర్రులో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు


పల్లిపాలెంలో పాడి రైతులకు దాణామృతాన్ని అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

అర్హులందరికీ పథకాల లబ్ధి


బండారులంకలో పథకాల గురించి వివరిస్తున్న మంత్రి విశ్వరూప్


మట్లపాలెం కాలనీలో మహిళకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

- మంత్రి పినిపే విశ్వరూప్
- బండారులంకలో గడప గడపకూ..

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాల లబ్ధి పారదర్శకంగా అందుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. బుధవారం బండారులంకలో మంత్రి కుమారుడు పినిపే శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల ద్వారా వారికి అందిన లబ్ధిని వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్యతోనే జీవితాలకు వెలుగు వస్తుందని, అందుకే పేదల విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఎంపీపీ కుదుపూడి భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం జి.వేమవరం పంచాయతీ మట్లపాలెం కాలనీలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ఆయా లబ్ధిదారులకు చదివి వినిపించారు. పథకాల బుక్‌లెట్ పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, దెయ్యాల సత్యనారాయణ, యర్రంనీడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం రూరల్: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చొల్లంగి శివాణి అన్నారు. భట్లపాలెం అగ్నికుల క్షత్రియ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రం ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి జి.గోపాలరావు, ఎంపీటీసీ కె.రాంబాబు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన


పరీక్ష కేంద్రంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ), స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి ఈ నెల 27న రాత పరీక్ష నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలను బుధవారం ఆర్‌ఏఓ మునిస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్లలో ఫర్నీచర్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. కనకాలపేట ప్రభుత్వ హైస్కూల్, ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల తదితర కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రాంతీయ విద్యా శాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు ప్రాధాన్యం

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, అనేక పదవులను కట్టబెట్టారని ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ ఇటీవల టీడీపీ నాయకులు బీసీల పేరున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన నేపథ్యంలో అదే ప్రాంతంలో పార్టీ, బీసీ నాయకులు పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుంతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ మాట్లాడుతూ చంద్రబాబు ఏనాడైనా బీసీలను రాజ్యసభకు పంపారా అని ప్రశ్నించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 56 బీసీ కార్పొరేషన్లు, మూడు రాజ్యసభ, ఐదు మంత్రి పదవులు కల్పించారన్నారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకన్న, నాయకులు రేవు మల్లీశ్వరి, అంకాడి అంజిబాబు, సర్పంచులు పెయ్యల మంగేష్, వెంటపల్లి నూకరాజు, శాఖా శంకరుడు తదితరులు పాల్గొన్నారు.


తాళ్లరేవులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

ఐ.పోలవరం: మణిపూర్ రాష్ట్రంలో రెండు తెగల మధ్య చిచ్చుపెట్టి చోద్యం చూస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని రిపబ్లికన్ పార్టీ డిమాండ్ చేసింది. స్థానికంగా ఆ పార్టీ మండల కన్వీనర్ రేవు శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్కడ మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్‌పీఐ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఝాన్సీకుమారికి అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌పీఐ నాయకులు

కుదుటపడిన లంక గ్రామాలు


వరద ముంపు నుంచి బయటపడిన కనకాయలంక కాజ్‌వేపై రాకపోకలు

పి.గన్నవరం: వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాలు కుదుటపడ్డాయి. మండలంలో మొత్తం 9 లంక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్న విషయం విదితమే. కె.ఏనుగుపల్లి, మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం, నాగుల్లంక శివారు పల్లిపాలెం, గుడ్డాయలంక రహదారులపై బుధవారం వరద తగ్గడంతో సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే వరద ముంపు నుంచి బయట పడటంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు మాత్రం వరదల సీజన్ తగ్గే వరకూ పడవలపైనే రాకపోకలు సాగిస్తారు. లంక గ్రామాల్లో వరద బాధితులకు అధికారులు సహాయక కార్యక్రమాలు ముమ్మరం చేశారు. మండలంలో వరద ముంపు బారిన పడిన కుటుంబాలకు ప్రభుత్వ సాయం పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. లంక గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యులు, అధికారులు చర్యలు చేపట్టారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు పశుగ్రాసం అందజేస్తున్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి చేయూత

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రుకు చెందిన ఆటోడ్రైవర్ కడిమి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రాజు కుటుంబానికి ది ఉప్పలగుప్తం ఆటో యూనియన్ సహకారంతో రూ.10 వేల నగదు, నిత్యావసర సరకులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బడుగు గణేష్, ఏసుబాబు, శివ, దుర్గబాబు, రవి, అర్జున్ దొరబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రాజు కుటుంబానికి సాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన ట్రస్ట్‌కు పట్టణానికి చెందిన శిఖా శ్రీనివాసరావు, నాగమణి దంపతులు రూ.20 వేల విరాళాన్ని సమర్పించారు. ఈ మొత్తానికి సంబంధిన చెక్కును ఆలయంలో పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణికి బుధవారం అందజేశారు. అనంతరం దాతలకు అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు.


దాతలకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

ఉప్పలగుప్తం: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. చల్లపల్లిలో హరిబాబు నివాసం నుంచి ఈ ర్యాలీని బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు చీకట్ల అబ్బాయి జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, అయితాబత్తుల సుభాషిణి, గెడ్డం సురేష్‌బాబు, ముషిని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అల్లవరం మండలం కొమరగిరి పట్నానికి చెందిన పిండి ప్రసాద్, తన భార్య అంజలితో కలసి బుధవారం స్కూటర్‌పై మురమళ్ల నుంచి సొంతూరు వెళ్తున్నారు. కొమానపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై అదుపుతప్పి పడిపోయారు. ప్రసాద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంజలి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి ప్రసాద్‌ను తరలించారు.

హనుమాన్ చాలీసా పారాయణ

కాట్రేనికోన: స్థానిక రాజుల వీధిలో ఎస్ ఆర్కే అశోక్ నిర్మించిన శ్రీకోదండరామ స్వామి ఆలయంలో తులసీధార హనుమాన్ చాలీసా పారాయణ బుధవారం జరిగింది. అమలాపురానికి చెందిన సకల కార్యసిద్ధి హనుమాన్ మందిర్ పండితుడు ఆకొండి పవన్‌కుమార్‌శర్మ హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఈ పారాయణ చేశారు. హనుమాన్ చాలీసా ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తూ దేశంలోని 108 కేంద్రాలను పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. సోమసూర్యనారాయణ రాజు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పవన్‌శర్మను ఘనంగా సత్కరించారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

యానాం: జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో యానాంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రీ రహదారిలోని వెంకయ్య విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఏ షణ్ముగం, పీఆర్‌ఏ కొల్లు ప్రసాద్, మున్సిపల్ సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ ఔదార్యం


కాకినాడ ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుధారాణి

ఉప్పలగుప్తం: శస్త్రచికిత్స చేయించుకుని కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛను సొమ్ము అందించి వలంటీర్ బడుగు సుధారాణి ఔదార్యాన్ని చాటింది. భీమనపల్లి గ్రామానికి చెందిన మెండి లక్ష్మి అనారోగ్యంతో జీజీహెచ్‌లో శస్త్రచికిత్స చేయించుకుంది. కాకినాడ వెళ్లి బుధవారం రూ.2,750 పింఛన్‌ను వృద్ధురాలికి ఆమె అందించింది. వలంటీర్‌ను సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, మండల వ్యవసాయ మండలి చైర్మన్ మానే శ్రీను, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, పంచాయితీ కార్యదర్శి పట్టా సత్యనారాయణ అభినందించారు.

భజరంగ్‌దళ్ నిరసన

అమలాపురం టౌన్: హిందువులపై దాడులను నిరసిస్తూ స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో భజరంగ్‌దళ్ ప్రతినిధులు బండారు విష్ణు, దొంగ రామకృష్ణ, ఆకుల రమేష్ నాయుడు, గొవ్వాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నానిరాజుకు మంత్రి పరామర్శ


సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: సోదర వియోగంతో బాధపడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. మృతుడు సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, హైదరాబాద్, విశాఖ మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ, కిమ్స్ వైద్య కళాశాల చైర్మన్ చైతన్యరాజు, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తదితరులు ఉన్నారు.

అమలాపురం రూరల్: కొంత కాలంగా పెరాలసిస్‌తో బాధపడుతున్న బండారులంక మాజీ సొసైటీ ఉపాధ్యక్షుడు, ఉప సర్పంచ్ కటకం గణపతిరావును మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించారు. చేనేత సొసైటీ అధ్యక్షుడు చింతా ఉమామహేశ్వరరావు, కాలెపు నాగశ్రీను తదితరులు ఉన్నారు.

డోలామణికి అభినందన


డోలామణి దంపతులను సత్కరిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి రుద్ర దంపతులను బుధవారం పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలుసుకున్నారు. బుధవారం బండారులంకలో ఆమె నివాసంలో కలుసుకుని అభినందనలు తెలిపారు. నాయకులు బళ్ల వెంకటేశ్వరరావు, పుత్సల వరదరాజులు, చింతపట్ల గంగా సత్యనారాయణ, కొండా సత్యనారాయణ రాజు, మాడా పద్మ దుర్గాప్రసాద్, బళ్ల శ్రీనివాస చక్రవర్తి తదితరులు ఉన్నారు.

వ్యక్తికి జైలు శిక్ష

తాళ్లరేవు: చింతాకులవారి పేట వద్ద 2017 డిసెంబర్ 8న జరిగిన రోడ్డు ప్రమాద కేసుకు సంబంధించి ఓ వ్యక్తికి ఏడాది జైలు, రూ.2,500 జరిమానా విధిస్తూ బుధవారం స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎ.నాగ మల్లీశ్వరి తీర్పునిచ్చారు. ఆ వివరాల్లోకి వెళితే.. చింతాకులవారిపేట వద్ద ఆటోను విత్తనాల లోవరాజు నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న మోటార్ సైక్లిస్ట్ మృతికి కారణమయ్యాడు. ఈ మేరకు అతనికి శిక్ష పడింది.